క్లుప్తంగా

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఉచిత వైద్యసేవలను వృద్ధులు వినియోగించుకోవాలని ఆయుర్వేద వైద్యనిపుణుడు ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ వృద్ధులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య నియమాలను తప్పక పాటించాలని చెప్పారు. ఆయుర్వేదం, హోమియో చికిత్సతో ఎలాంటి దుష్ఫలితాలు లేకుండా అన్ని దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం సుమారు 200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పర్యవేక్షించారు.

కాలువల పరిరక్షణకు చర్యలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కాలువల పరిరక్షణకు అధికారులు చర్యలను వేగవంతం చేశారు. కాలువల్లో చెత్తచెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉండాలంటూ అవగాహన కల్పించటంతో పాటు రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వంతెన వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య కార్మికులను నియమించి కాలువల్లో చెత్త వేయొద్దంటూ సూచిస్తున్నారు. దిగువ ప్రాంత వాసులు తాగునీటిగా వినియోగించుకునే కాలువలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత నగరవాసులపై ఉందని తెలుపుతున్నారు. కాలువలు, బుడమేరులో పరిశుభ్రతకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారు. వంతెనల వద్ద చెత్తచెదారం వేయడానికి అవసరమైన డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కోసం ప్రదర్శన జరిగింది. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు నీతి కథలు, చందమామ కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ప్రదర్శించి, వారితో చదివించారు. అనంతరం సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యాన ఉచితంగా నాట్యంలో శిక్షణ ఇచ్చారు. చిన్నారులు నృత్య రీతులను, సంగీత సాధన చేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకులు భాగవతుల వెంకట సీతారామ శర్మ, గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి, కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు జరిగాయి. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పూజల్లో పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి పంపారు.

కాకుమాను శివప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం



విజయవాడ కల్చరల్: తెలుగు ఫిల్మ్ ఛాంబర్ డిస్ట్రిబ్యూషన్ విభాగం కార్యదర్శిగా ఎన్నికైన కాకుమాను శివప్రసాద్‌ను ఆదివారం నగరానికి చెందిన పలువురు గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆత్మీయంగా సత్కరించారు. మాజీ కార్యదర్శి ముత్యాల రమేష్ మాట్లాడుతూ పంపిణీ రంగానికి చెందిన సమస్యల పరిష్కారానికి కలసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వీఎస్ మూవీస్ అధినేత పరచూరి విజయలక్ష్మి, సెక్టార్ మెంబర్ బాయన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులతో మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ 271 సచివాలయ పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. రామాలయం సమీపంలో పలగాని ప్రభాకర్ అపార్టుమెంట్‌లో 60 గృహాలకెళ్లి ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

అన్నివర్గాల నుంచి సానుకూలం

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలపై అన్ని వర్గాల నుంచి సానుకూలం వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాలతో వారు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ నెలలోనే విజయవాడలో రాష్ట్ర స్థాయి ఎన్జీవోల సమావేశం జరగనుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు. వీళ్లైనంత మేలు చేయడానికి, ప్రయోజనం కలిగించడానికి వైఎస్సార్ సీపీ పని చేస్తోందన్నారు. చంద్రబాబు గంటకో మాట, పూటకో మాట చెప్పడం, 600 హామీలు ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లడం, ఎల్లో మీడియా ద్వారా దాడి చేయిస్తున్నారని విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వాన్ని నియోజకవర్గంలోని 76 సచివాలయాల్లో పూర్తి చేసుకున్నామని, మిగిలిన 20 వచ్చే నెలలో పూర్తి చేస్తామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించి వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంచి నాయకత్వం గల లీడర్‌షిప్‌లో 2024 ఎన్నికలకు వెళ్లి విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, రామిరెడ్డి, బోరాబుజ్జి, వెంకట్, మస్తాన్, సాంబయ్య,హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డోర్ టు డోర్ వెరిఫికేషన్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఓటరు వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): పారదర్శక ఓటర్ జాబితా తయారీకి బూత్ లెవల్ అధికారుల (బీఎల్వో) సమగ్ర డోర్ టు డోర్ వెరిఫికేషన్ కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఆదివారం సాయంత్రం కమిషనర్ దుర్గ అగ్రహారం, ఎస్.ఎస్.ఎం.బోస్ నగర్, వాంబే కాలనీ, కండ్రిక, 236 పోలింగ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డోర్ టు డోర్ ఓటర్ సర్వేని ఎస్.ఇ. రామమోహన్‌రావు, అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజరీ అధికారులు మరింత బాధ్యతగా సర్వేను పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు డోర్ టు డోర్ వెరిఫికేషన్ ద్వారా ఓటర్ల జాబితాను పరిశీలిస్తారని చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ బూత్‌లో తగిన కారణాలను పరిశీలించి ఓటింగ్ శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు.

సర్వేలో ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని, జీరో డోర్ నంబర్ ఉన్న వాటిని, జంక్ క్యారెక్టర్లు ఉన్నవాటిని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. వయస్సు 100పై బడిన వారి ఓటర్ల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలన్నారు. బీఎల్వో యాప్‌లో సమస్య ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. బీఎల్వోలు నగరపాలక సంస్థ అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ అధికారులు, ఏఈఆర్వో, బీఎల్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులను ఓటరుగా నమోదు చేయాలని, ఓటర్ల సమస్యలను పరిష్కరించేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ హెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. దావు బుచ్చయ్యకాలనీలో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన రెసిడెన్షియల్ వెల్ఫేర్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన ఓటరు నమోదు మార్పులు చేర్పులు తదితర వివరాలను బీఎల్‌ఓ ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, మధు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్ నరేంద్ర వర్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఉచిత వైద్యసేవలను వినియోగించుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని డాక్టర్ పవన్‌కుమార్ నరేంద్రవర్మ సూచించారు. స్థానిక అయోధ్యనగర్ క్షత్రియ సేవ సంఘం భవనంలో ఆదివారం క్షత్రియ సేవా సంఘం, యువజన సంఘం ఆధ్వర్యాన తిరుమలరాజు సీతారామరాజు, వెంకట రామరాజు, సూర్యనారాయణరాజు సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆయన 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దాతల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ పవన్ కుమార్ నరేంద్ర వర్మ, డాక్టర్ నానిరాజు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసాదరాజు, వి.రామరాజు, ఎ.వెంకటేశ్వరరాజు, ఎస్.నరసింహమూర్తిరాజు, ఎల్.నారాయణబాబు, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కార్యాలయాల్లో స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ప్రతి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ ఆధ్వర్యాన జరగనుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరవాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయవచ్చని తెలిపారు.

బీఆర్టీఎస్ రోడ్డులో శాంతి ర్యాలీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన మారణ హోమాన్ని నిరసిస్తూ విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యాన ఆదివారం బీఆర్టీఎస్ రోడ్డులో శాంతి ర్యాలీ నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు ఎనోష్, డేవిడ్ పాల్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమంలో సుమారు 250 పైగా చర్చిలు ధ్వంసమయ్యాయని, వందల సంఖ్యలో క్రైస్తవులు మహిళలు హింసకు గురయ్యారని విచారం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో బిషప్ డాక్టర్ రబ్బాని, రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం, పాస్టర్ ప్రభాకర్, పాస్టర్ అల్లూరి విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

అబాకస్‌తో జ్ఞాపకశక్తి, మానసిక వికాసం పెంపు



అబాకస్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): అబాకస్‌తో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, విశ్లేషణ సామర్థ్యం, మానసిక ధైర్యం పెరుగుతాయని పటమట అబాకస్ సెంటర్ నిర్వాహకురాలు మానస మేడవరపు అన్నారు. ఆదివారం కంకిపాడులో జరిగిన రాష్ట్రస్థాయి మానసిక గణిత విశ్లేషణ (అబాకస్ అండ్ బ్రెయిన్ జిమ్) పోటీల్లో పడమట విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో 900 మంది విద్యార్థులు పాల్గొనగా పటమటకు చెందిన జి.సూర్యవర్ధన్, జి.ధాన్వికారెడ్డి, బి.ఆశ్రిత్, ధ్రితి అగర్వాల్, కె.శ్రీ సాయి నిత్య, పి.రుద్రమయంకా ద్వితీయ, తృతీయ స్థానాలు పొంది అవార్డులు సాధించారన్నారు. పటపట అబాకస్ సెంటర్ తరఫున పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చాటి అవార్డులు సాధించారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిప్ అకాడమీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్, స్టేట్ హెడ్ ఎం.గోపాలకృష్ణ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

దుర్గగుడి బస్సుల్లో ఈఓ తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల నుంచి దేవస్థానానికి నడుపుతున్న బస్సుల్లో దుర్గగుడి ఈవో భ్రమరాంబ తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం ఓం టర్నింగ్ వద్ద బస్సులను తనిఖీ చేసిన ఈవో భ్రమరాంబ భక్తులతో మాట్లాడారు. కండక్టర్ వద్ద మెషిన్ రికార్డు పరిశీలించడంతో పాటు టికెట్ల డబ్బులను లెక్కించారు. రికార్డు మొత్తానికి టికెట్ల డబ్బులు సరిపోవడంతో వారికి పలు సూచనలు చేశారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగడం, వారిని సకాలంలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌లకు చేర్చేలా చూడాలని ఆదేశించారు.

కృష్ణకిషోర్ సామాజిక సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న గోళ్ల నారాయణరావు వేదికపై అతిథులు

విజయవాడ కల్చరల్: జనవిజ్ఞానవేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ చేసిన సామాజిక సేవలు వెలకట్టలేనివని పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, సమతా సేవా సమితి, సంగమం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ సంస్మరణ సభను బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ సమాజంలోని మూఢాచారాల నిర్మూలనకు నిరంతర కృషి చేసినట్లు తెలిపారు. 1988 నుంచి జన విజ్ఞాన వేదికలో కీలకంగా పనిచేసినట్లు తెలిపారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ పూర్వ అధ్యక్షుడు బెల్లపు బాబ్జి మాట్లాడుతూ కళల ద్వారా సామాజిక మార్పును ఆశించిన కార్యకర్త ఆయన అని అభివర్ణించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవం విజయవంతం కావడానికి ఆయన కృషి చేసినట్లు తెలిపారు. కృష్ణకిషోర్ కుమార్తె అరుణ మాట్లాడుతూ ఆయన నిరంతరం సమాజం కోసమే కృషి చేశారన్నారు. వివిధ రంగాలకు చెందిన సత్యశ్రీనివాస్, అన్నే భాస్కరరావు, చింతా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలు శాంతిస్థాపనకు కృషి చేయాలి

ఏఐపీఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు



లెనిన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఏఐపీఎస్ఓ, ఇతర సంఘాల నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ దేశాలు ఆధిపత్య ధోరణి పక్కనపెట్టి శాంతి స్థాపనకు కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఏఐపీఎస్ఓ) రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు అన్నారు. ఏఐపీఎస్ఓ ఆధ్వర్యాన ఆదివారం లెనిన్ సెంటర్‌లో నాగసాకి, హిరోషిమా డే సందర్భంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచశాంతి వర్ధిల్లాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, యుద్ధాలు వద్దు శాంతి ముద్దు వంటి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 1945 ఆగస్టు 6, 9 తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణుబాంబు దాడి జరిగిందన్నారు. ఆ రోజును ప్రపంచ మానవాళి చీకటి దినంగా జరుపుకుంటోందన్నారు. గతంలో జరిగిన అణుదాడి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, పెంచలయ్య , పలువురు నాయకులు పాల్గొన్నారు.

మతతత్వాన్ని పెంచి పోషిస్తున్న పార్టీలకు గుణపాఠం నేర్పాలి

షేక్ నాగుల్‌మీరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలో మతతత్వాన్ని పెంచి పోషిస్తున్న రాజకీయ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మతాల మధ్య గొడవలు సృష్టించేందుకు కొన్ని ముఠాలు దిగాయని, మణిపూర్‌లో క్రైస్తవుల మీద, హరియాణాలో మస్జీద్ ఇమామ్‌పై జరిగిన దాడి ఘటనలు దేశం తలదించుకునేలా చేస్తున్నాయన్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, 2024 ఎన్నికల్లో బీజేపీకి, దానికి మద్దతు తెలుపుతున్న ఇతర పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తమ కమిటీ ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గంలో 17వ నెల సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, సెప్టెంబర్ 17వ తేదీన ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వివరించారు. ఏఎంసీ నాయకులు ఎండీ కాలేషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు షేక్ సాజిద్ అలీ, సయ్యద్ మౌలాలి, షేక్ ఆదం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి సమాజానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా గాయకుడు గద్దర్ మృతి సమాజానికి తీరని లోటు అని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. సత్యనారాయణపురం గాయత్రి కన్వెన్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం ప్రజా గాయకుడు గద్దర్ సంతాప కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తన పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, చల్లా సుధాకర్, దమ్మాలపాటి చంద్రశేఖర్, మల్లాది రాజేంద్ర , జె.కె.సుబ్బారావు , యల్లాప్రగడ సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. మంగళగిరికి చెందిన నటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రదర్శన ఇవ్వగా, భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

10న తుర్లపాటి జయంతి సభ

విజయవాడ కల్చరల్: శ్రీకళాభారతి తెలుగు కళావాహిని ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కృష్ణకళాభారతి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ గురువారం సాయంత్రం గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు 90వ జయంతి సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తుర్లపాటి జవహర్, చింతకాయల చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి తుర్లపాటి కుటుంబరావు అభిమానులు, సాహితీవేత్తలు, కవులు కళాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సండే సందడి









నగరంలో పార్కులు రద్దీగా కనిపించాయి. ఆదివారం కావడంతో రాజీవ్‌గాంధీ పార్క్‌లో సందర్శకులు, చిన్నారుల తాకిడి అధికంగా ఉంది. పలు రకాల ఆటపరికరాల వద్ద పిన్న, పెద్ద సందడి చేశారు. కృష్ణలంక హైవేపై అందుబాటులోకి రానున్న అంబేడ్కర్ పార్కులో ఏనుగు బొమ్మ వద్ద చిన్నపిల్లలు, పెద్దలు సెల్ఫీలు తీస్తూ కనిపించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ